AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN

హైదరాబాద్‌లో బీజేపీ నేతల నిరసన

అక్షరటుడే, హైదరాబాద్ సిటీ: న్యూఢిల్లీలోని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధికారిక నివాసం వద్ద కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన నిరసన కార్యక్రమానికి వ్యతిరేకంగా తెలంగాణ బీజేపీ నేతలు, కార్యకర్తలు హైదరాబాద్‌లో నిరసన తెలిపారు. అత్యంత భద్రత కలిగిన ప్రాంతంలో భద్రతా నిబంధనలను రాహుల్ గాంధీ ఉల్లంఘించారని ఆరోపించారు. హైదరాబాద్‌లో గాంధీ భవన్ వైపు ర్యాలీకి వెళ్తున్న తెలంగాణ బీజేపీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

డ్రామాలు కట్టిపెట్టి చర్చకు రండి..: బండి సంజయ్

అక్షరటుడే, ఢిల్లీ: ఢిల్లీలో రాహుల్ గాంధీ, తెలంగాణలో రేవంత్ రెడ్డి తల పెట్టిన ఆందోళనలు కేవలం రాజకీయ డ్రామాలేనని కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దేశంలో కాంగ్రెస్‌ను ప్రజలు ప్రతిపక్షంగా కూడా గుర్తించడం లేదని, కేవలం రాజకీయ నాటకాలతో ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ ఆందోళనలు చేస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ తీరు వల్లే బీజేపీకి రాజకీయ లబ్ధి చేకూరుతోందని వ్యాఖ్యానించారు.

22-7-2026 (Wedneday) MAIN EDITION

దక్షిణ కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడి



అక్షరటుడే, నేషనల్‌డెస్క్: దక్షిణ కాశ్మీర్‌లోని కోకెర్‌నాగ్-అనంతనాగ్ రహదారిపై ఉగ్రవాదులు జమ్మూకాశ్మీర్ పోలీసు బృందంపై దాడి చేశారు. ఘటనలో ఒక పోలీసు మరణించారు. దీంతో భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. అనంతరం వెంటనే అదనపు బలగాలను ఘటనా స్థలానికి పంపించారు.

హైదరాబాద్‌లో కలవరపెడుతున్న కొత్త కేసులు



అక్షరటుడే, హైదరాబాద్: దేశవ్యాప్తంగా కరోనా కేసులు మళ్లీ పెరుగుతుండడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోనూ పాజిటివ్ కేసులు వేగంగా నమోదవుతుండడంతో పాటు మరణాలు సంభవించాయి. అక్కడ ఒమిక్రాన్ వేరియంట్ నిర్ధారణ కావడంతో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమై టెస్టుల సంఖ్యను పెంచింది.

గిగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



అక్షరటుడే, హైదరాబాద్ : గిగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. గిగ్ వర్కర్లు, డ్రైవర్లను అగ్రిగేటర్ సంస్థలు మోసం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని అగ్రిగేటర్ సంస్థలతో మాట్లాడి వాళ్లకు న్యాయం చేయాలని కోరారు.

నీట్ వ్యవహారంపై ఉభయ సభల్లో గందరగోళం నెలకొంది. ప్రశ్నాపత్రం లీకేజీపై చర్చించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని విపక్షాలు పట్టుబట్టాయి. దీనిపై ప్రధాని సభలో మాట్లాడాలని డిమాండ్ చేస్తున్నాయి. కేంద్రం చర్చకు అంగీకరించినా.. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశాకే చర్చించాలని ఇండియా కూటమి ఎంపీలు పట్టుబట్టారు. దీంతో ఉభయ సభలు సాగడం లేదు. స్పీకర్ చెప్పినా.. సభ్యులు శాంతించకపోవడంతో రెండు సభల్లో వాయిదా పర్వం కొనసాగుతోంది.

- అక్షరటుడే, ఢిల్లీ

'నీట్'పై సభలో గందరగోళం

- చర్చకు సిద్ధమని కేంద్రం ప్రకటన
- విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని విపక్షాల డిమాండ్
- కొనసాగుతున్న వాయిదాల పర్వం

నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం.. ఢిల్లీలో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఓ వైపు సభలో విపక్షాలు, బయట సీజేపీ ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్నాయి. ప్రతిపక్షాల నినాదాలు, నిరసనల మధ్య, నీట్ పేపర్ లీక్ అంశంపై సమగ్ర చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు లోక్‌సభలో ప్రకటించారు. నిరసనకారులపై పోలీసులు దౌర్జన్యం చేశారని ప్రతిపక్షాలు గొంతెత్తాయి. ప్రధాన మంత్రి ప్రకటన చేయాలని డిమాండ్ చేశాయి. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ మాట్లాడకపోవడంతోనే తాము ఆయన నివాసం బయట ధర్నా చేయాల్సి వచ్చిందన్నారు.

సభ వాయిదా

చర్చకు ప్రభుత్వం అంగీకరించినప్పటికీ, పార్లమెంటులో చర్చ జరగడానికి ముందే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని విపక్షాలు డిమాండ్ చేశారు. పాలక, ప్రతిపక్ష పక్షాలు రెండూ చర్చను కోరుకుంటున్నాయని చెబుతూ స్పీకర్ ఓం బిర్లా చర్చను ప్రారంభించడానికి ప్రయత్నించారు, కానీ రాజీనామా డిమాండ్ విషయంలో ప్రతిపక్షాలు వెనక్కి తగ్గకపోవడంతో సభను వాయిదా వేయాల్సి వచ్చింది. మళ్లీ సభ ప్రారంభం అయినా.. విపక్షాలు ఆందోళన కొనసాగించడంతో రేపటికి వాయిదా వేశారు. లోక్ సభ నుంచి టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీని స్పీకర్ సస్పెండ్ చేశారు.

స్పీకర్‌తో ఎస్పీ చీఫ్ భేటీ

సభ వాయిదా పడగానే స్పీకర్ ఓం బిర్లాతో సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ భేటీ కాగా, మరోవైపు హోంమంత్రి అమిత్ షాతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ భేటీ అయ్యారు. జేపీ నడ్డా మంగళవారం సీజేపీతో చర్చలు జరిపారు. ఈ సారి చర్చలకు జంతర్ మంతర్ వద్దకు రావాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు.

దీక్ష విరమించాలని విజ్ఞప్తి

సోనమ్ వాంగ్‌చుక్ దీక్ష విరమించాలని సీజేపీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆయనకు లేఖ రాసింది. మీ త్యాగం విద్యార్థులకు స్ఫూర్తి.. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించింది. దీక్షతో ఈ పోరాటం ముగిసిపోదని వాగ్దానం చేసింది. తాము పోరాటం కొనసాగిస్తామని సీజేపీ నాయకులు పేర్కొన్నారు.

నాపై కుట్ర..: సీఎం రేవంత్‌రెడ్డి

అక్షరటుడే, కొడంగల్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి తనపై కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. వారి తప్పులను ప్రశ్నిస్తున్నందుకు కొడంగల్‌లో కాంగ్రెస్‌కు ఓటు వేసిన వారి ఓట్లను తొలగిస్తున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం కొడంగల్‌లో తన ఎన్యుమరేషన్ ఫారం నింపి బీఎల్‌వోకు అందించారు. అనంతరం ఆయన బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. రోజుకు 18 గంటలు పనిచేసినా సమయం సరిపోవట్లేదన్నారు. కొడంగల్‌లో నేరుగా ఎదుర్కోలేక తనను దెబ్బతీసేందుకు కాంగ్రెస్ ఓట్లు తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కొడంగల్‌లో దెబ్బతీస్తే రాష్ట్ర స్థాయికి రాలేడు అని ఆలోచిస్తున్నారని పేర్కొన్నారు. పేర్లు వేరైనప్పటికీ బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పనిచేస్తున్నాయన్నారు.

పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ అరెస్ట్

అక్షరటుడే, హైదరాబాద్: పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. లోక్ భవన్ వద్ద నిరసన తెలిపేందుకు వెళ్తున్న ఆయనను అదుపులోకి తీసుకొని నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ మంగళవారం ఢిల్లీలో నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. ఆయనను పోలీసులు అరెస్ట్ చేశారు. దీనికి నిరసనగా కాంగ్రెస్ నాయకులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ హైదరాబాద్‌లోని లోక్ భవన్ వద్ద ఆందోళన చేపట్టిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను పోలీసులు అడ్డుకున్నారు.



రెడ్కో డీఈ ఇంట్లో ఏసీబీ సోదాలు

అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే సమాచారంతో టీజీ రెడ్‌కో డీఈ ముత్యం వెంకటరమణ ఇళ్లలో ఏసీబీ అధికారులు సోదాలు చేస్తున్నారు. ఏక కాలంలో 15 చోట్ల 8 బృందాలతో ఏసీబీ తనిఖీలు కొనసాగుతున్నాయి. బుధవారం తెల్లవారు జామున నుంచే ఈ తనిఖీలు చేపట్టారు. ముత్యం వెంకటరమణ టీజీ రెడ్‌కోలో డిప్యూటీ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. ఆయన భారీగా అక్రమాస్తులు కూడబెట్టారని ఏసీబీకి ఫిర్యాదులు అందాయి. ఏసీబీ డీఎస్పీ మాజీద్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో సోదాలు చేపట్టారు. మాదాపూర్‌లోని ఆయన నివాసంతో పాటు కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. సోదాల్లో కీలక ఆస్తి పత్రాలు, డబ్బు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

సీజేపీ నిరసనలపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు

అక్షరటుడే, ఢిల్లీ: ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. నిరసనకారులపై జరిగిన అణచివేత సందర్భంగా పోలీసులు దురుసుగా ప్రవర్తించారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌పై అత్యవసరంగా విచారణకు సుప్రీంకోర్టు బుధవారం నిరాకరించింది. వీడియోలను సమర్పించి కోర్టు సమయాన్ని "వృథా" చేయవద్దని సీజేఐ సూర్యకాంత్ పిటిషనర్‌కు సూచించారు. కాగా.. ఇదే విషయమై దాఖలైన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించడానికి మంగళవారం ఢిల్లీ హైకోర్టు నిరాకరించిన విషయం తెలిసిందే.

ప్రధాని మోదీతో శరద్ పవార్ భేటీ

అక్షరటుడే, ఢిల్లీ: పార్లమెంటు వెలుపల ప్రతిపక్ష ఎంపీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్న తరుణంలో, ప్రధానమంత్రి కార్యాలయంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీఎస్‌పీ) అధినేత శరద్ పవార్, ఆయన కుమార్తె, ఎంపీ సుప్రియా సూలే బుధవారం ప్రధాని నరేంద్ర మోదీని ఆయన కార్యాలయంలో కలిశారు. సమావేశంలో ఇరువర్గాలు నవ్వుతూ మాట్లాడుకుంటున్న చిత్రాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. దేశంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, నీటిపారుదల అంశాలపై ప్రధానికి శరద్ పవార్ ఈ సందర్భంగా వినతిపత్రం సమర్పించారు.

జెనరిక్ మందులపై సుంకాలు..: ట్రంప్

అక్షరటుడే, నేషనల్‌డెస్క్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరో బాంబు పేల్చారు. ఆగస్టు 2028 నుంచి దిగుమతి చేసుకునే జెనరిక్ మందులపై భారీ సుంకాలను విధిస్తామని ప్రకటించారు. ఫార్మాస్యూటికల్ ఉత్పత్తుల ఉత్పత్తిని దేశీయంగానే చేపట్టడమే లక్ష్యంగా సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. అమెరికాకు జెనరిక్ మందులను అత్యధికంగా ఎగుమతి చేసే భారతదేశంపై ఈ చర్య ప్రభావం చూపే అవకాశం ఉంది. దశలవారీ సుంకాల ప్రణాళిక ఆగస్టు 1 నుండి అమల్లోకి వస్తుందని, మొదటి రెండు సంవత్సరాలు దేశంలోకి తీసుకువచ్చే అన్ని జెనరిక్ మందులపై యునైటెడ్ స్టేట్స్ సున్నా శాతం సుంకాన్ని కొనసాగిస్తుందని తెలిపారు. మూడవ సంవత్సరానికి, సుంకాన్ని 100 శాతానికి, ఆ తర్వాత 200 శాతానికి పెంచుతామని చెప్పారు.

ఫిఫా బాస్‌కు ఐరాస పగ్గాలు..?

అక్షరటుడే, నేషనల్ డెస్క్: ప్రపంచ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) అధ్యక్ష పదవిలో ఉన్న గియాని ఇన్‌ఫాంటినోను ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శిగా చూడాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. మెక్సికో, కెనడా, అమెరికా సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌ను ట్రంప్, గియాని కలిసి వీక్షించిన అనంతరం ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేక ప్రతినిధి పౌలో జంపోలి వెల్లడించిన వివరాల ప్రకారం.. 211 సభ్య దేశాలున్న ఫిఫాను గియాని ఇన్‌ఫాంటినో అద్భుతంగా నిర్వహించారని ట్రంప్ కొనియాడారు. అదే బాధ్యతను 193 దేశాల సమాఖ్య అయిన ఐక్యరాజ్యసమితికి కూడా అప్పగిస్తే బాగుంటుందనే ఆలోచనలో ట్రంప్ ఉన్నట్లు ఆయన తెలిపారు.

సీజేపీ ఆందోళనలో యువకుడి అనుచిత వ్యాఖ్యలు

అక్షరటుడే, ఢిల్లీ: ఢిల్లీలో జరిగిన సీజేపీ ఆందోళన సందర్భంగా ఓ యువకుడు ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి తీవ్ర పదజాలంతో హెచ్చరికలు జారీ చేశాడు. మోదీ తనకు దొరికితే వదిలిపెట్టనని, కాల్చి చంపేస్తానని బెదిరింపులకు దిగాడు. అంతేకాకుండా, అత్యంత అసభ్యకరమైన భాషలో బూతులు తిడుతూ, ప్రధాని తల్లిని కూడా దూషించాడు. ఈ వివాదాస్పద వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరసనలు శాంతియుతంగా జరగాలని, ఇలాంటి అంతులేని దురుసు ప్రవర్తన వల్ల అసలైన విద్యార్థుల ఉద్యమం పక్కదోవ పడుతుందని మండిపడుతున్నారు.